

నరసన్నపేటలో ఎంఈవోకు రిపోర్టు ఇస్తున్న బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు

కొత్త ఉపాధ్యాయులు.. వచ్చే'సార్'!

- ఎమ్మార్సీల వద్ద సందడి
- పాఠశాలల్లో విధుల్లో చేరిన గురువులు

నరసన్నపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ముగిసింది. బదిలీ అయిన ఉపాధ్యాయులు సోమవారం కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్ -2 హెచ్ఎంలు, పీఎస్‌హెచ్ఎంలు, పీడీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు మొత్తం 6,392 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 4,156 మందికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఇందులో ఎస్జీటీలు 1,962 మంది ఉన్నారు. వారంతా సోమవారం మండల రిసోర్సు భవనాల్లో ఎంఈవోలకు రిపోర్టు సమర్పించారు. అనంతరం కొత్త పాఠశాలల్లో చేరారు. ఎస్జీటీలు సుమారు 70శాతం మేరకు అదే మండలాల్లో వేరొక పాఠశాలల్లో బదిలీ కాగా, 20 శాతం పక్క మండలాలకు బదిలీపై వెళ్లారు. మరో 10శాతం ఎస్జీటీలు సుదూర ప్రాంతాల మండలాలకు బదిలీ అయ్యారు. నరసన్నపేట మండలంలో 52 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా 26 మంది మండల పరిధిలోనివారే. మిగిలిన ఉపాధ్యాయులు సమీప మండలాల నుంచి బదిలీపై వచ్చారు. ఎంఈవోలకు రిలీవింగ్ కాపీలు అందజేసి జాయినింగ్ ఆర్డర్లతో పాఠశాలల్లోని విధుల్లో చేరారు.

వేసవిలో..

అధిక వర్షపాతమే

- మే నెలలో పుష్కలంగా వర్షాలు
- జూన్ ఆరంభంలోనూ అదేరీతిన..
- మొత్తంగా 25.88 మిల్లీమీటర్లు అదనం
- పెరిగిన భూగర్భ జలమట్టం



శ్రీకాకుళంలో జలమయమైన రహదారి (ఫైల్)

శ్రీకాకుళం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సిక్కోలు.. అత్యధిక తీరప్రాంతం కలిగిన పేదల ఊటీగా ప్రసిద్ధి చెందింది. ఈ ఏడాది వేసవి తీవ్ర ప్రతాపం చూపినా.. జిల్లాలో మాత్రం మే నెలలో రికార్డుస్థాయిలో వర్షం కురిసింది. దీంతో ఏప్రిల్‌లో అడుగంటిన భూగర్భ జలాలు మే నెలలో కురిసిన వర్షాల ప్రభావంతో పైకి వచ్చాయి. ఈ నెలలోనూ అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉండడంతో ఎండల ప్రభావం చల్లబడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలు, నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించినస్థాయి కంటే అధికంగా వర్షపాతం నమోదైంది.

● లోటు నుంచి పైపైకి...

వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్‌లో 27.59 మి.మీ వర్షం కురవాలి. కానీ కేవలం 12.8మి.మీ మాత్రమే వర్షం కురిసింది. అందుకే జిల్లా ప్రజలు ఏప్రిల్‌లో తీవ్ర వేడితో ఇబ్బందులు పడ్డారు. ఇక మే నెల విషయానికొస్తే... 92.33 మిల్లీమీటర్లు వర్షానికిగానూ 159.97 మి.మీ వర్షం కురిసింది. అంటే ఏకంగా 67.64 మిల్లీమీటర్లు వర్షం అదనంగా కురిసింది. దీంతో మే నెలలో వేడిమి ఎక్కువగా ఉన్నా కాస్త ఉపశమనం కూడా లభించింది. ఈ నెలలో ఒకటి నుంచి 15 రోజుల వరకు 57.99 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే 67.21 మి.మీ వర్షం కురిసింది. దీనివల్ల సాధారణ వర్షపాతం కంటే జూన్ సగంలోనే అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో మే, జూన్.. ఇప్పటివరకు పరిశీలిస్తే ఏకంగా 25.88 మిల్లీమీటర్లు వర్షపాతం అధికంగా కురిసింది.

● నిండిన చెరువులు.. జలాశయాలు

అదనపు వర్షపాతం వల్ల జిల్లాఅంతటా చెరువులు కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు కూడా పైకి వచ్చాయి. కేవలం కవిటి, ఇచ్ఛాపురం, (మిగతా 4వ పేజీలో..)

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

మండలం	మే నెల		జూన్ (1 నుంచి 15 రోజులు)		అధిక/లోటు వర్షం
	కురవాల్సింది	కురిసినది	కురవాల్సింది	కురిసినది	
ఆమదాలవలస	89	196.04	47.91	52.89	10.39
బూర్జ	90.6	180.6	49.42	61.38	24.2
ఎచ్చెర్ల	94.1	190.09	44.63	49.26	10.37
జి.సిగడాం	92.1	166.98	43.24	63.61	47.11
గార	81.2	205.51	50.74	51.34	1.18
హిరమండలం	101.6	167.38	59.1	74.49	26.04
ఇచ్ఛాపురం	86.9	113.59	63.94	44.43	-30.51
జలుమూరు	107.5	203.36	48.56	57.33	18.06
కంచిలి	97.1	109.45	58.14	71.51	23
కవిటి	92.4	111.53	68.56	59.05	-13.87
కోటబొమ్మాళి	81.8	192.97	40.81	62.45	53.03
కొత్తూరు	118.7	165.43	58.19	76.32	31.16
లావేరు	88.7	175.59	51.8	54.84	5.87
ఎల్.ఎన్.పేట	85.9	178.52	46.63	66.81	43.28
మందస	90.3	109.54	56.72	79.59	40.32
మెళియాపుట్టి	106.8	131.64	64	83.37	30.27
నందిగాం	79.8	121.26	45.84	87.4	90.66
నరసన్నపేట	95.8	208.5	62.94	53.56	-14.9
పలాస	89.1	112.46	55.61	83.12	49.47
పాతపట్నం	98.7	160.54	56.45	78.15	38.44
పోలాకి	99.8	213.93	66.92	53.13	-20.61
పొందూరు	105.4	184.72	44.23	53.89	21.84
రణస్థలం	88.5	145.33	53.04	67	26.32
సంతబొమ్మాళి	88.4	168.37	47.16	69.8	48.01
సారవకోట	106.8	178.48	61.65	69.48	12.7
సరుబుజ్జిలి	85.9	193.6	46.63	58.73	25.95
సోంపేట	88.8	107.84	53.14	76.59	44.13
శ్రీకాకుళం	74.3	196.7	40.95	51.56	25.91
టెక్కలి	79.4	148.54	61.29	78.62	28.28
వజ్రపుకొత్తూరు	84.5	117.35	53.47	87.41	63.47
మొత్తం	**92.33**	**159.97**	**53.39**	**67.21**	**25.88**

జీడితోటలో సగం కాలిన మృతదేహం

- అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి
- పక్కా ప్లాన్‌తో హత్య చేశారని ఆరోపణ
- విభిన్న కోణాల్లో పోలీసుల దర్యాప్తు



రాజేశ్వరి (ఫైల్)



దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హరిపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉండే మందస ఉద్దానం ప్రాంతంలో.. పాత జాతీయ రహదారికి సమీపాన జీడితోటలో సగం కాలిన ఓ వివాహిత మృతదేహం కనిపించడంతో అలజడి రేగింది. ఐదు రోజుల కిందట ఆమె అదృశ్యం కాగా.. సోమవారం విగతజీవిగా కనిపించింది. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం కాగా.. ఎవరో ఆమెను హత్య చేసి ఉంటారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనకు సంబంధించి మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందస మండలం పిడిమందస గ్రామానికి చెందిన వివాహిత ముంజేటి రాజేశ్వరి(23) సోమవారం అంబుగాం పాత జాతీయరహదారి సమీపాన లోహరిబంద పంచాయతీ కొత్తపేట జీడితోటల్లో విగతజీవిగా కనిపించింది. సగం కాలిన మృతదేహాన్ని స్థానికులు గుర్తింగి పోలీసులకు సమాచారం అందించారు. రాజేశ్వరికి పాలవలసకు చెందిన గోకర్ల చంద్రశేఖర్‌తో ఐదేళ్ల కిందట వివాహమైంది. మూడేళ్లు, ఐదు నెలల చిన్నారులు ఉన్నారు. చంద్రశేఖర్ వలస కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 11న రాజేశ్వరి కన్నవారింటి నుంచి అత్తవారింటికి పాలవలస బయలుదేరింది. హరిపురంలో బంధువులు ఆమెను బస్సు ఎక్కించారు. కాగా ఆ రోజు రాత్రి ఆమె పాలవలస చేరుకోకపోవడంతో ఇరు కుటుంబ సభ్యులూ ఆందోళన చెందారు. రాజేశ్వరి ఆచూకీ కనిపించడం లేదంటూ మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం జీడితోటల్లో సగం కాలిన వివాహిత మృతదేహం లభ్యం కాగా.. సమీపంలో సెల్‌ఫోన్ కూడా దొరకడంతో దాని ఆధారంగా.. ఆమె రాజేశ్వరి అని గుర్తించారు. సంఘటనా స్థలాన్ని కాశీబుగ్గ (మిగతా 4వ పేజీలో..)

పైపైకి.. బంగారం

- 10 గ్రాములు రూ.లక్షా 3వేలు
- తగ్గినట్టే తగ్గి.. పెరుగుతున్న ధరలు
- అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులే కారణం



నరసన్నపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బంగారం ధర మరో మారు లక్ష మార్కు దాటింది. ఇటీవల తగ్గినట్టు తగ్గిన బంగారం ధర.. గత నాలుగురోజులుగా మళ్లీ పెరుగుతోంది. దీంతో ధర మరింత తగ్గుతుందని.. ఆషాడంలో కొనుగోలు చేయవచ్చనుకునే వినియోగదారుల ఆశలు అడియాశలయ్యాయి. సోమవారం నరసన్నపేట బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల బిస్కెట్ ధర రూ.లక్షా మూడు వేలు పలికింది. ఈ లెక్కన తులం బంగారం రూ.లక్షా 19వేలు ఉంది. ఇదే ఆల్‌టైం రికార్డు అని వ్యాపారులు చెబుతున్నారు. బంగారం బాటలో వెండి కూడా పరుగులు పెడుతోంది. వెండి కిలో సోమవారం నాటికి రూ.లక్షా పదివేలు పలికింది. ఇక ఆర్నమెంట్ బంగారం కూడా గ్రాము ధర రూ.9,215కి చేరింది. గతేడాది ఇదే నెలలో ఆర్నమెంట్ ఆభరణాలు గ్రాము ధర రూ.6వేల లోపు ఉండేది. ఏడాదిలో గ్రాముకు రూ.3వేలు పైన అంటే.. 50శాతం వరకు బంగారం ధరలు పెరిగినట్టే. ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధర పెరిగిపోయింది. స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. ట్రంప్ అవలంభించిన పన్నుల విధానంపై ఇంకా స్పష్టత లేకపోవడం తదితర కారణాలతో బంగారం ధర పెరుగుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆషాడ, శ్రావణమాసాలకు బంగారం గ్రాము ధర రూ.11వేలు చేరే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. గత నెలలో పది గ్రాముల బంగారం ధర లక్ష నుంచి రూ.92వేలకు పడింది. ఆర్నమెంట్ బంగారం కూడా 85వేలు పలికింది. ఆ సమయంలో కొంతమంది కొనుగోలు చేసి కాస్త లబ్ధి పొందారు. ఇంకా ధరలు తగ్గుతాయని ఎదురుచూసిన వారు మాత్రం ప్రస్తుతం నిరాశ చెందుతున్నారు. ధరలు పెరగడంతో నరసన్నపేట, శ్రీకాకుళం, పలాస-కాశీబుగ్గ, సోంపేట, టెక్కలి తదితర ప్రాంతాల్లో బంగారం దుకాణాలు వెలవెలబోతున్నాయి.

కళింగపట్నం- పార్వతీపురం రోడ్డుకు రూ.40 కోట్లు మంజూరు

అరసవల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కళింగపట్నం - శ్రీకాకుళం మీదుగా పార్వతీపురం రోడ్డు విస్తరణకుగాను కేంద్ర ప్రభుత్వం రూ.40కోట్లు విడుదల చేసింది. సెంట్రల్ రోడ్ ఫండ్ స్కీమ్ 2025-26 సంవత్సర బడ్జెట్‌లో భాగంగా రాష్ట్రానికి రూ.275కోట్లు విడుదల చేస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగానే సోమవారం కళింగపట్నం- శ్రీకాకుళం-పార్వతీపురం రోడ్డుకు రూ.40కోట్లు మంజూరు చేస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

డీఎస్సీకి 724 మంది హాజరు

ఎచ్చెర్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి సంబంధించి మెగా డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ పరీక్షలు రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తున్నారు. సోమవారం శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 579 మంది విద్యార్థులకు 540 మంది హాజరయ్యారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల)లో 200 మంది విద్యార్థులకు 184 మంది హాజరయ్యారు. మొత్తం రెండు కేంద్రాల్లో 779 మంది విద్యార్థులకుగానూ 724 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు.



మెళియాపుట్టి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

6లో

సమస్యలు పరిష్కరించాలని ఆఫ్‌షోర్ నిర్వాసితుల ఆందోళన

రైతులకు ఆదాయం..

ప్రజలకు ఆహ్లాదం

- జిల్లాలో వెదురు సాగుకు ఆసక్తి
- పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు
- బీడు భూములు సస్యశ్యామలం

4లో

జయకృష్ణాపురంలో మినుగుడు పిల్లి



టెక్కలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం తొలుసూరుపల్లి పంచాయతీ జయకృష్ణాపురంలోని బులవంద కర్ర చెరువు వద్ద సోమవారం ఓ మినుగుడు పిల్లి కనిపించడంతో గ్రామస్థులు భయాందోళన చెందారు. పులిలా చారలు కలిగి ఉండడంతో.. అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈ తరహా జంతువులు ఎక్కువగా కొండల ప్రాంతాల్లో ఉంటాయని అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఆ మినుగుడు పిల్లి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు.



డయేరియా నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డా.అనిత

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల్లో డయేరియా ప్రమాదకరమని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత పేర్కొన్నారు. సోమవారం డయేరియా నివారణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 'డయేరియా రహిత సమాజ సాధనకు కృషి చేయాలి. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేలా జూలై 31 వరకు డయేరియా నివారణ కార్యక్రమాలు నిర్వహించాల'ని పీహెచ్‌సీల వైద్యాధికారులకు ఆదేశించారు. పిల్లలను ఈ వ్యాధి నుంచి కాపాడేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. చిన్నారులకు రోటా వైరస్, తట్టు టీకాలు వేయించాలన్నారు. డయేరియా సంభవిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యకర్త, ఆశాలు డయేరియా నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐవో డా.రాందాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరీన్, డా.వెంకటలక్ష్మి, రామనాగేశ్వరరావు, డి.భాస్కరకుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ బాధలు తప్పేదెప్పుడో?

- ఆమదాలవలస రోడ్డులో ప్రయాణికులకు అవస్థలు

5లో

వీరికి నిరాశ

- కొంత మందికి అందని 'తల్లికి వందనం' డబ్బులు
- 300 యూనిట్లు విద్యుత్ వినియోగించారంటూ అనర్హత
- బిల్లుల రశీదులో 200 యూనిట్లలోపు వినియోగం
- ఆధార్ అనుసంధానంతోనే అసలు ఇబ్బందులు
- సరిచేయాలని ప్రభుత్వానికి బాధితుల వేడుకోలు

● రణస్థలం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన సూరాడ దీప్తికి ఇద్దరు పిల్లలు. కొవ్వాడ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన 'తల్లికి వందనం' పథకంలో ఆమెను అనర్హులుగా తేల్చారు. ఆమె పేరిట ఉన్న విద్యుత్ మీటరు ద్వారా నెలకు 300 యూనిట్లు వినియోగిస్తుండడంతో అనర్హత వేటు వేశారు. కాగా తాము ఎప్పుడూ అంత విద్యుత్ వినియోగించలేదని ఆమె చెబుతోంది. సచివాలయానికి వెళ్లి అడగ్గా.. విద్యుత్ కార్యాలయానికి వెళ్లమంటున్నారు. అక్కడికి వెళితే సచివాలయానికి వెళ్లాలని సూచిస్తున్నారు. దీంతో అర్హత ఉన్నా తమకు పథకం వర్తించడం లేదని ఆమె లబోదిబోమంటోంది.

● జీరుపాలేం గ్రామానికి చెందిన అంబటి ఎర్రమ్మ అదే పరిస్థితి. ఆమెకు సైతం తల్లికి వందనం జమకాలేదు. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు వినియోస్తున్నట్లు చూపిస్తోంది. కాగా.. తాము రేకులు షెడ్‌లో ఉంటున్నామని, గతంలో అమ్మ ఒడి పథకం వర్తించిందని.. ఇప్పుడు మాత్రం కొర్రీలు పెడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.

తల్లికి వందనం



రణస్థలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలామంది తల్లులది ఇదే పరిస్థితి. అర్హత ఉన్నా తల్లికి వందనం పథకం వర్తించకపోవడంతో ఆయా మహిళలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో తల్లికి వందనం పథకం కింద 2,28,659 విద్యార్థులకు సంబంధించి.. 1,52,563 మంది తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం ఇటీవల రూ.13వేల చొప్పున నగదు జమ చేసింది. ఈ పథకానికి సంబంధించి ముందుగా సచివాలయాల వారీగా అనర్హుల జాబితా ప్రకటించింది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, ఆదాయపు పన్ను కడుతున్నవారు, 300 యూనిట్ల కంటే అదనంగా విద్యుత్ వాడుతున్నవారు, నాలుగు చక్రాల వాహనం కలిగిన వారు, భూములు అధికంగా ఉన్నవారు వంటి కారణాలతో అనర్హులుగా చూపింది. అయితే ఇందులో చాలామంది నిరుపేద, సామాన్యులకు మాత్రం 300యూనిట్ల విద్యుత్ వాడకాన్ని సాకుగా చూపి అధికారులు నిధులు జమ చేయకుండా నిలిపివేశారు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. ఏడాది కాలంలో తాము చెల్లించిన విద్యుత్ బిల్లులు తీసుకెళ్లి.. సచివాలయ సిబ్బంది (మిగతా 4వ పేజీలో..)

అంత విద్యుత్ వాడలేదు..



నా పేరు మీద విద్యుత్ మీటరు లేదు. మాది సామాన్య కుటుంబం. ప్రతీ నెలా వంద యూనిట్లలోపే విద్యుత్ వినియోగిస్తాం. కానీ, 300 యూనిట్లు వినియోగిస్తున్నట్టు చెప్పి.. నాకు పథకం వర్తించలేదు. అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలి.

-లావేటి రామాయమ్మ, జేఆర్‌పురం

అధికారులు స్పందించాలి..



సాధారణంగా మాకు నెలకు రూ.200 నుంచి రూ.250 వరకూ విద్యుత్ బిల్లు వస్తుంది. అటువంటిది మేము 300 యూనిట్లు వినియోగించామని చెబుతుండడం అన్యాయం. సచివాలయ అధికారులను అడుగుతుంటే సమాధానం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి.. తప్పిదాలను సరిచేయాలి.

-మైలపల్లి పొట్టమ్మ, కొవ్వాడ

రైతుకు ఆదాయం.. ప్రజలకు ఆహ్లాదం



- పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు
- సస్యశ్యామలమవుతున్న బీడు భూములు
- జిల్లాలో వెదురు సాగుకు రైతుల ఆసక్తి

పాత శ్రీకాకుళం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో వెదురు సాగు ఇటీవల కాలంలో పెరుగుతోంది. పూర్వీకులు తట్టలు, బుట్టలు తదితర గృహోపకరణాలకు ఎక్కువగా వినియోగించేవారు. తర్వాత సరళీకరణ విధానాల నేపథ్యంలో ప్లాస్టిక్ ఉత్పత్తులు మార్కెట్లోకి రావడంతో కొంతకాలం వెదురు ఉత్పత్తులకు గిరాకీ లేకుండాపోయింది. అయితే ఇటీవల కాలంలో పర్యావరణంపై కొంత మేర ప్రజల్లో అవగాహన పెరగడంతో మళ్లీ వెదురుతో తయారు చేసే ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించడానికి ముందుకొస్తున్నారు. దీంతో సాగు విస్తర్ణం కూడా క్రమేణా పెరుగుతోంది. రైతుకు ఆదాయం లభించడమేకాకుండా పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతోంది. అంతే కాకుండా వెదురు తోటల వల్ల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తోంది. దీంతో రైతులు బీడు భూముల్లో సాగుచేస్తుండడంతో అవి సస్యశ్యామలంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 400 ఎకరాల వరకూ వెదురును సాగుచేస్తున్నారు. జిల్లాలో మందస మండలంలోని వనాలి, బుడుంబో, పాతపట్నం మండలంలోని బద్దుమర్రి, తరువాడ, కొత్తూరు మండలంలోని అడ్డంగి, బోతలగూడలో ఎక్కువగా వెదురు సాగులో ఉంది.

ఇదీ పరిస్థితి..

దేశంలో 13.96 మిలియన్ హెక్టార్లలో వెదురు సాగు సాగు చేస్తున్నారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద వెదురు ఉత్పత్తిదారుగా నిలిచింది. సాగుకు సాధారణంగా తేమతో కూడిన వాతావరణం అవసరం. ఎటువంటి నేలల్లోనైనా వెదురు పెరుగుతుంది. ఒకప్పుడు ఉత్తర, తూర్పు రాష్ట్రాల్లో ఎక్కువగా సాగుచేసేవారు. ప్రస్తుతం దక్షిణ భారతదేశంలోనూ వెదురు పంటకు డిమాండ్ పెరుగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి భారత్ వెదురు మార్కెట్ విలువ 2,622 కోట్లుగా ఉండగా 2030 నాటికి అది రూ.3,647 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. 2023-24లో రూ.1,164 కోట్ల విలువైన వెదురు ఉత్పత్తులు ఎగుమతి చేశారు. ప్రధానంగా భూటన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, శ్రీలంక, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, మాల్దీవుల వంటి దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. మరోవైపు చైనా, వియత్నాం నుంచి రూ.530 కోట్ల విలువగల వెదురును దిగుమతి చేసుకున్నారు. వెదురు ప్రస్తుత డిమాండ్ సంవత్సరానికి 27 మిలియన్ టన్నులుగా అంచనా వేశారు.



వెదురును ఉపయోగించి తయారుచేసిన వస్తువులు



నాలుగో ఏట నుంచి..

వెదురును టిష్యూకల్చర్ లేదా రైజోమ్ విధానంలో సాగుచేసే అవకాశాలు ఉన్నాయి. మొక్కలు నాటిన తర్వాత మూడు సంవత్సరాల వరకు అవి బలంగా పెరిగేలా పోషకాలు అందించాలి. నాలుగు, లేదా ఐదో ఏట నుంచి ప్రతి ఏటా వెదురు దుంగల కోత మొదలవుతుంది. ఒక్కసారి నాటిన వెదురు ద్వారా 40 ఏళ్ల వరకు రైతులకు ఆదాయం లభిస్తుంది. పర్యావరణ పరిరక్షణలో వెదురు కీలక పాత్ర పోషిస్తోంది. ఇవి అధిక ఆమ్లకర్బణాన్ని గ్రహించి గాలిలో ఆక్సిజన్ విడుదల చేస్తాయి. వర్షపు నీటిని నేలలో చొప్పించి భూగర్భ జలాలను నింపుతాయి. నేలకోతను నివారిస్తాయి.

గృహోపకరణాలకు..

ఇంటి నిర్మాణం, చీరలు, అగరబత్తీలు, అగరబత్తీలు, బుట్టలు, ఫర్నీచర్, ఫ్లోరింగ్, గృహోపకరణాలు, డెకరేటివ్ వస్తువులు, బాంబూ చికెన్, బాంబూ బిర్యానీ వంటి ఆహార పదర్థాలు తయారీలో, కాగిత పరిశ్రమకు వెదురు ప్రధాన ముడి పదార్థంగా వెదురును కాలంలో వినియోగిస్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సాహం..

జాతీయ వెదురు మిషన్ ద్వారా రైతులకు మొక్కలు, శిక్షణ, పరికరాలు అందజేయడంతోపాటు మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పించి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.



బ్లాక్ ప్లాంటేషన్, బీడు భూముల్లో వెదురు నాటిన రైతులకు హెక్టారుకు రూ. 50,000 వరకు సబ్సిడీ లభిస్తోంది. చిన్న వెదురు నర్సరీలకు రూ.10 లక్షల వరకు రాయితీ అందజేస్తున్నారు. బైబ్యాక్ ప్రోగ్రాం ద్వారా రైతులు సాగుచేసిన వెదురు పంటకు గ్యారెంటీ మార్కెట్ సదుపాయం కల్పించడంతో స్థిరమైన ఆదాయం లభిస్తోంది.

వెదురుతో స్థిరమైన ఆదాయం..



సాగుచేసిన ఐదో సంవత్సరం నుంచి రైతుకు ఆదాయం లభిస్తుంది. ఎకరాకు 10 నుంచి 14 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు గరిష్ఠంగా రూ.27,000 ధర లభిస్తుంది. ఆరో సంవత్సరం నుంచి ఎకరాకు సుమారు రూ. 1.5 లక్షల ఆదాయం సాధ్యం లభించే అవకాశం ఉంది. వెదురు పంట పర్యావరణం హితమైంది. రైతులకు స్థిర ఆదాయ వనరుగా మారుతుంది. అంతర్జాతీయ స్థాయిలో వెదురుకు గిరాకీ పెరుగుతుం డడంతో ఈ పంటకు మంచి భవిష్యత్తు ఉంది. దీంతో రైతుల వెదురు సాగు వైపు దృష్టి సారించాలి.

-రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

సమస్యలను పరిష్కరించండి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు



అర్జీ అందజేసేందుకు ఆటోలో వస్తున్న దివ్యాంగురాలు



సమస్య విన్నవించి బయటకు వస్తున్న వృద్ధురాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజాతో కలిసి మీ కోసం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 114 వినతులను స్వీకరించారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. స్వీకరించిన అర్జీలను వాటికి సంబంధించిన శాఖల అధికారులకు అప్పగించి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పింఛన్ రాదు.. పథకాలు అందవు

- కలెక్టర్ గ్రీవెన్స్‌లో దివ్యాంగులు, వృద్ధులు వినతులు

శ్రీకాకుళంలోని జడ్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కలెక్టర్ గ్రీవెన్స్‌లో పింఛన్లతోపాటు పథ కాలు అందడంలేదని ఎక్కువ సంఖ్యలో వినతులు అందాయి.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా..

'నాలుగేళ్లుగా పింఛన్ ఆపేశారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. దయచేసి ఆదుకోండి' అని టెక్కలికి చెందిన దివాంగురాలు గొంటి వెంకటరత్నం వాపోయింది. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేసింది. రెండు కాళ్లు పనిచేయవని, ఎన్నో ఏళ్లుగా వస్తున్న పింఛన్‌ను ఆధార్‌కార్డు నెంబర్‌తో ఓ కారు రిజిస్టర్ అయ్యిందని పేర్కొని నిలిపివేశారని వాపోయింది.ఈ విషయంపై పలుసార్లు ఫిర్యాదుచేసినట్లు తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి తన సమస్య వివరించినట్లు పేర్కొంది. దీంతో ఆర్డీవో కార్యాలయం సిబ్బంది డిలీట్ చేసి నో అబ్జెక్షన్ ధ్రువపత్రం కూడా మంజూరు చేశారని, పది నెలలు కావస్తున్నా ఇంతవరకు పింఛను మంజూరు చేయలేదని వాపోయింది. తక్షణమే పింఛన్ మంజూరు చేసి తనను ఆదుకోవాలని కోరింది.



మీకోసంలో వినతిని పరిశీలిస్తున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

రెండు కార్లు నమోదయ్యాయని..

'నా ఆధార్ నెంబర్‌తో ఎవరివో రెండు కార్లు నమోదయ్యాయని పేర్కొని, రెండేళ్లుగా మమ్మల్ని అన్ని ప్రభుత్వ పథకాలకు దూరం చేశారు. ఎవరో చేసిన తప్పుకు మేం శిక్ష అనుభవిస్తున్నాం. చివరకు పిల్లల్ని చదివించుకోవడానికి కూడా తల్లికి వందనం పథకం రాలేదు'. అని శ్రీకాకుళానికి చెందిన కొమనాపల్లి లచ్చుమయ్య గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశాడు. రెండు సంవత్సరాలుగా ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని, ఇప్పటికైనా ఆధార్ నెంబర్‌తో లింకైన వివరాలను డిలీట్ చేసి, ప్రభుత్వ పథకాలను వర్తింపజేసి తమను ఆదుకోవాలని కోరాడు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రమణ

బాధితులకు న్యాయం చేయండి: ఏఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీస్ అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేసి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అదనపు ఎస్పీ కేవీ రమణ ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 56 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు.

నేడు శ్రీకూర్మం గ్రామ దేవత ఉత్సవం

గార, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మం గ్రామ దేవత మోహినీ భద్రాంబిక అమ్మవారి ఉత్సవం (పండుగ) మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం గ్రామంలో మహిళలు ఘటాలు, మేళ తాళాలతో గ్రామ దేవత అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని అక్కడ పూజలు చేసి చల్లదనం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. వివిధ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు గార పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మోహిని అమ్మవారు



శ్రీకూర్మ క్షేత్రంలో యోగాంధ్ర

గార, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మ క్షేత్రంలో సోమవారం యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నెలరోజుల పాటు ప్రజలను భాగస్వాములను చేస్తూ యోగాంధ్రను పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనుందని, ఇందులో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొంటారని చెప్పారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ యోగా అభ్యాసం చేయాలన్నారు. యోగాను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్‌తో పాటు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.అనంతరం శంకర్ శ్రీకూర్మనాథుని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖతోపాటు వివిధ శాఖల అధికారులు యోగా సాధకులు శిక్షకులు పాల్గొన్నారు.

వేసవిలో.. అధిక వర్షపాత 'మే'

(మూడో పేజీ తరువాయి)

నరసన్నపేట, పోలాకి మండలాల్లో మాత్రమే లోటు వర్షపాతం నమోదైంది. ఈ నాలుగు మండలాల్లో భూగర్భ జలాలు కాస్త తగ్గుదల ఉంది. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్‌లో 9.68 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉండేవి. ఇప్పుడు 9.84 మీటర్ల లోతున భూగర్భ జలాలు లభ్యమవుతున్నాయి. గతే డాది ఏప్రిల్‌లో -0.16 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉండేవి. గతేడాది జూన్ 1 నుంచి ఈ ఏడాది మే 31వరకు 1,156 మిల్లీమీటర్లు వర్షపాతం కురవాల్సి ఉంది. అయితే 1,247.11 మి.మీ వర్షపాతం కురిసింది. ఏడాదిలో 7.88 శాతం అధిక వర్షపాతం వల్ల భూగర్భ జలాలు కూడా పైకి వచ్చాయి. అందు బాటులో జలం లభ్యమవుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు కూడా పుష్కలంగా లభించే అవకాశం ఉండడం శుభపరిణామమే.

జీడితోటలో సగంకాలిన మృతదేహం

(మూడో పేజీ తరువాయి)

డీఎస్పీ వెంకటప్పారావు, సీఐ తిరుపతిరావు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీమ్‌ను తెప్పించి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, ఎవరో పథకం ప్రకారమే రాజేశ్వరిని హత్య చేసి.. కాల్చేసి జీడితోటల్లో పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పాలవలసలో సంబరాలు నిర్వహించగా.. అదేసమయంలో ఆ గ్రామానికి చెందిన ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ప్రస్తుతం రాజేశ్వరి హత్యకి, ఆ యువకుడి హత్యకు సంబంధం ఉంటుందా? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్నికోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు.

వీరికి నిరాశ

(మూడో పేజీ తరువాయి)

వద్ద మొర పెట్టుకుంటున్నారు. తాము అంత విద్యుత్ వినియోగించలేదని చెబుతూ బిల్లులు చూపుతున్నారు. అయితే తల్లికి వందనం లబ్ధిదారు రాలైన తల్లి ఆధార్ నంబర్ వేరొకరి విద్యుత్ కనెక్షన్‌తో అనుసంధానం అయినందునే అధిక యూనిట్లు విని యోగ జాబితాలో చేర్చి ఉంటారని సచివాలయ ఉద్యో గులు అనుమానిస్తున్నారు. దీంతో విద్యుత్ కార్యాల యాల వద్దకు వెళ్లి అడగ్గా.. ఆధార్ అనుసంధాన ప్రక్రియ తమ వద్ద లేదని చెబుతున్నారు. సచివాలయాల్లో సైతం విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో తమ సమస్య ఎలా పరి ష్కారమవుతుందో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఈ నెల 21నుంచి వారం రోజుల పాటు ఫిర్యాదుల విభాగానికి అవకాశం కల్పించింది. ఫిర్యాదుల విభాగం ద్వారా అయినా తమ సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టా లని పలువురు మహిళలు కోరుతున్నారు.

బాక్సింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు జాతీయస్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళానికి చెందిన ఎస్.దేవి వరప్రసాద్ 52-54, జి.సత్యభార్గవ్ 80-85 కిలోల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటారు. దీంతో వీరిద్దరూ బుధవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు వరప్రసాద్, సత్యభార్గవ్‌లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా బాక్సింగ్ కార్యదర్శి బీపీ లక్ష్మణ్‌దేవ్, శిక్షకులు ఎం.ఉమామహేశ్వర రావు, లండ అనిల్‌కుమార్ అభినందించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల, బాలు, జి.ఆనంద్ స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఈసందర్భంగా గాయకులు అమిత, మంగవేణి, నిక్కు అప్పన్న, కేఎల్ఎన్ మూర్తి, ఎ.బాబూరావు, చిన్నమనాయుడు, జి.వీర్రాజు, డబ్బింగ్ భాస్కర్, రేజేటి సతీష్, బాలాజీ శ్రీనివాస్, యాబీ రాజు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన సినిమా గీతాలను అలపించారు. ఫిల్మ్ డబ్బింగ్ ఆర్టిస్ట్, బి.గ్రేడ్ సింగర్ కె.భాస్కరరావుకు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు ఎంవీ కామేశ్వరరావు, బలివాడ మల్లేశ్వరరావు, పి.వైకుంఠరావు, దుర్గాప్రసాద్, మండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సినీ గీతాలను అలపిస్తున్న గాయకులు

ట్రాఫిక్ బాధలు తప్పేదెప్పుడో?

- రోడ్డు పూర్తయినా.. కల్వర్టుల వద్ద అదే పరిస్థితి
- ఆమదాలవలస రోడ్డులో ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని యంత్రాంగం

ఆమదాలవలస, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత రద్దీ అయిన రహదారుల్లో ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు ఒకటి. ఈ రహదారిలో ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులో నిరంతర ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై వాహనచోద కులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో హైవేకి సమీపాన కొత్తరోడ్డు దగ్గర ఉన్న కాలువ పై గల వంతెన వద్ద సోమవారం ట్రాఫిక్ సమస్య నెలకొంది. శ్రీకాకుళం పట్టణం నుంచి ఆమదాలవలస వరకు ఉన్న ఈ ప్రధాన రహదారిలో సుమారు ఆరు సంవత్సరాలుగా భారీ స్థాయిలో గుంతలు ఏర్పడి ఎన్నో రోడ్డు ప్రమాదాలు సంబంధించి పలువురు వాహనదారులు ప్రాణాలు కూడా కోల్పోయారు. మరెంతోమంది గాయపడి ఆసుపత్రిపాలయ్యారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక దృష్టిసారించి రహదారి నిర్మాణాన్ని చాలావరకు పూర్తి చేయించారు. అయితే ఈ రహదారిలో కొన్ని కల్వర్టుల వద్ద వంతెన నిర్మాణాలు చేపట్టకపోవడం వల్ల ఆయా చోట్ల నిత్యమూ ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ కొత్తరోడ్డు సమీపంలో ఉన్న వంతెన వద్ద ఇరువైపులా భారీస్థాయిలో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీనితో ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర అత్యవసర వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. రహదారి అభివృద్ధి పరిచినా ఫలితం ఏమిటని వారంతా ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా వేసవి కాలంలో కల్వర్టులు వంతెన నిర్మాణాలు పూర్తి చేయాల్సిన రోడ్లు భవనాలశాఖ అధికారులు పూర్తిస్థాయి ఇర్లక్ష్యం వహించడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సా యంత్రం వేళల్లో శ్రీకాకుళం- ఆమదాలవలస మధ్య ట్రాఫిక్ సమస్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ సమయాల్లో ఆయా చోట్ల ట్రాఫిక్‌ను క్రమద్దీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను స్థానికులు కోరుతు న్నారు. తద్వారా అయినా ఈ సమస్యకు కాస్త పరిష్కారం దొరుకుందంటున్నారు.



కాలువ వద్ద నిలిచిపోయిన వాహనాలు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎచ్చెర్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బడేవానిపేట ఫీడర్ పరిధిలో ఈ నెల 18న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఫీడర్ పరిధిలో మరమ్మతులతోపాటు కొత్తలైన్ల నిర్మాణం, విద్యుత్ నియంత్రికల ఏర్పాటు తదితర పనులు చేపట్టేందుకు సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీంతో బడివానిపేట, కొయ్యాం, జాలారి కొయ్యాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



జడ్పీ కార్యాలయ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కార్మికులకు శాశ్వత సెటిల్‌మెంట్ చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని టీజీఐ కంపెనీ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో హోమ్ నుంచి జడ్పీ కార్యాలయం వరకు ర్యాలీ వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీజీఐ కంపెనీ స్థాపించిన 20 ఏళ్ల నుంచి కార్మికులందరూ పని చేస్తున్నారన్నారు. ఆరేళ్ల కిందట సాంకేతిక కారణాలతో మూసివేశారని, ఇంతకాలం ఎటువంటి సెటిల్‌మెంట్ చేయకపోవడం అన్యాయమన్నారు. అనంతరం డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పి.రాము, ఎస్.ప్రసాద్, జి.కామయ్య, బి.లక్ష్మణ, ఆదినారాయణ, లచ్చయ్య, గురుమూర్తి, రాంబాబు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన

ఆమదాలవలస, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు ఎన్‌సీసీ విద్యార్థులు కేడెట్ వెల్ఫేర్ సొసైటీ మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గొంటి గిరిధర్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ప్రార్థన సమయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆ చెక్కులను విద్యార్థుల తల్లిదండ్రుల రూ.6 వేలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో రాణిస్తే విద్య, ఉద్యోగంలో మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ అధికారులు మోహన్‌రావు, శరత్ కుమారిలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పైల రవికుమార్, ఉపాధ్యాయులు షేక్ షవలీ, అప్పల శివరాజ్, ఈశ్వరరావు, మనోహరరావు, ఉమాకుమారి, జి.కుమారి, ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపడేలా 'తల్లికి వందనం'

అరసవల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పిల్లలను చదివించే ప్రతీతల్లి, బిడ్డ ఆనందపడేలా 'తల్లికి వందనం' పథకం అమలు చేశామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ తెలిపారు. ప్రతీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ ఈ పథకం అమలు చేసి, పిల్లల చదువుకు ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. ఈ పథకం అమలు విజయవంతం కావడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 42 లక్షల మందికి అమ్మఒడి అమలు చేస్తే, నేడు కూటమి ప్రభుత్వం 67.27లక్షల మందికి లబ్ధిచూకూర్చిందన్నారు. ఒకటో తరగతి, అలాగే ఇంటర్ ఫస్టియర్ చేరే పిల్లలు సుమారు 11 లక్షల మంది ఉన్నారని, వారి వివరాలు పూర్తి స్థాయిలో అందిన వెంటనే వారికి కూడా ఈ పథకం అమలు చేస్తామన్నారు. లోకేశ్ పై చేసిన ఆరోపణలు రుజువు చేయాలని వైసీపీ నాయకులకు ఆయన సవాల్ విసిరారు.

టీడీపీ నేతల పరామర్శ

ఇచ్ఛాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎంతోటూరు గ్రామానికి చెందిన డీలర్ దక్కత వరప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దక్కత కామేష్, టీడీపీ నాయకులు ప్రకాష్, శ్రీను, రాజేంద్ర ప్రసాద్, ధర్మరాజు పాల్గొన్నారు.

రిమ్స్ అన్నపూర్ణ పథకానికి వితరణ

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అందిస్తున్న అన్నపూర్ణ పథకానికి నగరంలోని బ్యాంకర్స్ కాలనీకి చెందిన రిటైర్డు హెచ్‌ఎం ఉప్పు దామోదరరావు సోమవారం రూ.20 వేలు వితరణగా అందజేశారు. ఈ మేరకు రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షుడు గంగుల రమణబాబు ఆ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సత్య జూయలర్స్ కృష్ణారావు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'మడ్డువలస' కాలువ పనులు



పూడికలు తొలగిస్తున్న దృశ్యం

జి.సిగడాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మడ్డువలస కుడిప్రధాన కాలువ పనులు సోమవారం పెంట గ్రామ పరిధిలో మడ్డువలస నీటి యాజమాన్య సంఘం-13 అధ్యక్షురాలు మీసాల విజయమ్మ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఏఈ రాజశేఖర్ పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ కాలానికి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల మేరా పనులు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, పిచ్చి మొక్కలు తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు టంకాల విజయబాబు, చెలికాని శ్రీనివాసరావు, పున్నాన పాపినాయుడు, కిల్లారి అప్పలనాయుడు, గార వాసుదేవరావు, నాయకులు పున్నాన అక్కలనాయుడు, గేదెల రమణ, చింత భాస్కరరావు, మీసాల నారాయణరావు, మీసాల రమణ, మీసాల సూరిబాబు, వి వెంకటనాయుడు, సిగటాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పిచ్చిమొక్కల తొలగింపు

ఆమదాలవలస, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దివాంజీపేట గ్రామ శ్మశాన వాటిక పరిసరాల్లోని పిచ్చి మొక్కలను గ్రామ యువత పిచ్చి మొక్కల తొలగింపు సోమవారం చేపట్టారు. గ్రామ ప్రజలు అందించిన విరాళాలతో జంగిల్ క్లియరెన్స్ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో యువత ఎడ్ల రాంబాబు, జోగి సత్యనారాయణ, బలగ ప్రసాదరావు, జోగి చందు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులుగా బాధ్యతలు



మన్మథరావు

సరుబుజ్జిలి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా కె.మన్మథరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన బి.పద్మనాభం ఆమదాలవలస ఎస్‌టీవోగా బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో పాలకొండ నుంచి బదిలీపై వచ్చిన మన్మథరావు వ్యవసాయాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

- ఎచ్చెర్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా వావిలపల్లి రాజేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎచ్చెర్లలో ఇప్పటివరకు వ్యవసాయధికారిగా పనిచేసిన వై.సురేష్ జిల్లా వనరుల కేంద్రానికి బదిలీపై వెళ్లారు.



రాజేశ్వరరావు

బీఆర్‌ఏయూలో 'యోగా మంత్'



యోగాసనాలు వేస్తున్న వర్సిటీ వీసీ రజని తదితరులు

ఎచ్చెర్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో యోగా మంత్ కార్యక్రమం కొనసాగుతుంది. వర్సిటీలోని యోగా హాల్‌లో అధికారులు సోమవారం యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖ సాగరతీరంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు వర్సిటీ వర్గాలు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఎస్‌వో సామ్రాజ్యలక్ష్మి, అకడమిక్ ఎఫైర్స్ డీన్ కె.స్వప్నవాహిని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో చదువుకు పెద్దపీట



పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ శివ్వాల

సరుబుజ్జిలి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు చదువుకు పెద్దపీట వేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. సోమవారం కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యామిత్ర కిట్లు పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలందరూ చదువుకోవాలనే లక్ష్యంగా ప్రతి ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ తల్లికి వందనం పథకం ద్వారా సాయం అందించారన్నారు. హెచ్‌ఎం టీవీఎస్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

బూర్జ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపేట పంచాయతీ ప్రభుత్వ పాఠశాలలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యార్థుల తల్లిదం డ్రులు పాల్గొన్నారు.

- సోంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జింకిభద్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాకిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఎంపీపీ నిమ్మన దాసు, సర్పంచ్ తామాడ పద్మావతి, ఎస్‌ఎంసీ చైర్మన్ పి.హేమ, టీడీపీ నాయకులు చిత్రాడ శేఖర్ తదితరులు ఉన్నారు.
- కవిటి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముత్యాలపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విద్యాకానుక కింద పుస్తకాలు, బ్యాగులు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేష్, పి.వెంకటరావు, ఆర్.నారాయణరావు, కృష్ణమూర్తి ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

కవిటి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను పూర్వ విద్యార్థులు (1979-80) ప్రోత్సహించారు. సహకారాన్ని అందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రతిభ చూపిన బి.పవిత్ర, ఎన్.హాసిని, బి.హర్షితలకు పారితోషికంతోపాటు మెమెంటోలు అందించారు. పాఠశాలకు అవసరమైన సీపీయూ సెట్ అందించారు. హెచ్‌ఎం ఎన్.విశ్వనాథం, తదితరుల పాల్గొన్నారు.

ఉపనిషన్మందిరం నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

శ్రీకాకుళం కల్చరల్ జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపనిషన్మందిరం 2025-26కి నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా గుమ్మా నగేష్, ఉపాధ్యక్షులుగా పప్పు పతంజలిశాస్త్రి, సనపల నారాయణమూర్తి, డాక్టర్ బారువ కొండలరావు, డాక్టర్ ఈశ్వర సూర్యసంపత్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా విశ్వనాథ కామేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా డీజీ పట్నాయక్, డి.అరుణకుమారి, రామారావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు రిటైర్డు డీఈవో బలివాడ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కవిటి సచివాలయం కిటకిట



కవిటి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కవిటి సచివాలయం-1 సోమవారం లబ్ధిదారులతో కిటకిటలాడింది. ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం అందని లబ్ధిదారులు తమ దరఖాస్తులు పట్టుకొని అధికారుల వద్దకు చేరుకు న్నారు. తామంతా ఎందుకు అర్హత లేకుండా పోయామంటూ అధికారులకు మొరపెట్టుకున్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకంలో ఆధార్ కార్డు లింకు చేసుకునేందుకు రైతులు చేరుకున్నారు. సచివాలయ సిబ్బంది వారికి కావల్సిన పత్రాలు ఇవ్వడంతో పాటు వివరాలను నమోదు చేశారు.

బ్యాంకుల వద్ద బారులు..



ఇచ్ఛాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' డబ్బులు జమకావడంతో తీసుకోవడానికి బ్యాంకుల వద్ద మహిళలు బారులుతీరుతున్నారు. సోమవారం పట్టణ పరిధిలో గల ఎస్‌బీఐ, యూనియన్, ఇండియన్, కేవీబీ, కెనరా, ఎస్‌బీహెచ్ బ్యాంకులు వద్ద, ఏటీఎంలవద్ద మహిళలు డబ్బులు తీసుకొనేందుకు పోటీ పడ్డారు. మరికొందరు డబ్బులు ఖాతాలో పడ్డాయో లేదో తెలుసుకొనేందుకు బ్యాంకులకు పాస్‌బుక్ అప్‌డేట్ చేయించుకు న్నారు.

'తల్లికి వందనం'తో ఆనందోత్సాహాలు

ఎల్.ఎన్.పేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'తల్లికి వందనం' కార్యక్రమం అమలు చేయడంపై తల్లుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కోవిలాం గ్రామంలో సోమవారం టీడీపీ నాయకులతో కలిసి పలువురు మహిళలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయడం ద్వారా సీఎం చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎ.పోలినాయుడు, వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, చిరంజీవి, కోవిలాం గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఎన్. నారాయణరావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మాట తప్పని నేత సీఎం చంద్రబాబు

హిరమండలం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని, మాట తప్పని నాయకుడు సీఎం చంద్రబాబు అని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. సోమవారం సుభలయ ఆర్‌ఆర్ కాలనీలో తల్లికి వందన పథకం లబ్ధిపొందిన విద్యార్థులు, తల్లులు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఫ్లెక్సీకి పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక రోజారాణి, ఎంపీటీసీ చింతాడ బుడ్డు, టీడీపీ నాయకులు యాళ్ల నాగేశ్వరరావు, ఎస్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో ఆనందం

పాతపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం చెల్లింపులతో మహిళల్లో ఆనందోత్సాహాలు నింపాయని టీడీపీ మండల అధ్యక్షుడు సైల బాబ్జీ అన్నారు. పాతపట్నం పిల్లివీధిలో సోమవారం సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, పలువురు నేతలు, మహిళలు పాల్గొన్నారు.



హిరమండలం: ఫ్లెక్సీకి పాలభిషేకం చేస్తున్న విద్యార్థుల తల్లులు





పాతపట్నం, ఎల్ఎన్‌పేటల్లో సీఎం చంద్రబాబు తదితరుల ఫ్లెక్సీ, చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న మహిళలు

సాయినగర్‌లో రెండిళ్లలో చోరీ

నరసన్నపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సౌభాగ్యలక్ష్మీ కల్యాణ మండపం వెనుక వైపు ఉన్న సాయినగర్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు హల్‌చల్ చేశారు. కాలనీకి చెందిన గనగళ్ల రాంబాబు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు దుంగ రామారావు ఇళ్ల తాళాలు పగులగొట్టి లూటీ చేశారు. సోమవారం ఉదయం స్థానికులు అటుగా వెళ్లగా ఇళ్లు తెరిచి ఉండడంతో వెంటనే పోలీసులకు, బాధితులకు సమాచారం ఇచ్చారు. బాధిత కుటుంబాలు గత కొన్నాళ్ల నుంచి విశాఖపట్నంలో కుమారుల ఇళ్లలో ఉంటున్నారు. వెంటనే బాధితులు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరి జరిగిన ఇళ్లను ఎస్ఐ దుర్గాప్రసాద్ పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. దుంగ రామారావు ఇంట్లో 44 తులాల వెండి, మూడు తులాల బంగారం ఆభరణాలు, రూ.35వేల నగదు, మూడు వాచీలు చోరీకి గుర య్యాయి. గనగళ్ల రాంబాబు ఇంట్లో కేజీన్నర వెండి వస్తువులు, నాలుగు తులాలు బంగారం ఆభరణాలు పోయినట్లు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పొందూరు రైల్వేస్టేషన్ వద్ద సోమవారం రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. గుర్తుతెలియని రైలు నుంచి జారి పడడంతో ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. ఈ వ్యక్తికి సుమారు 45 నుంచి 50 సంవత్సరాలు వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్టయితే జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పోలీసు లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



పాడె మోస్తున్న ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ శ్రీనివాస్

సోంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాం గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ పొట్టి జగదీష్ శనివారం రాత్రి టెక్కలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. జగదీష్ మృతదేహానికి పోలీసు లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ వెంకట అప్పారావు, సోంపేట సీఐ మంగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భార్య పుష్పకు పోలీసుల తరుపున రూ.లక్ష తక్షణ సాయాన్ని అందజేశారు.

నమ్మించి మోసగించాడంటూ యువతి ఫిర్యాదు

శ్రీకాకుళం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తనను నమ్మించి మోసగించాడంటూ ఓ యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. రాగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం వీపీ రాజుపేటకి చెందిన రౌతు వెంకటేష్ పనిచేస్తున్నాడు. ఇదే ఆసుపత్రిలో విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలానికి చెందిన ఓ యువతి పనిచేస్తోంది. వీరిద్దరి మధ్య పరిచయం పెరిగి.. అది ప్రేమగా మారింది. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని ఆ యువతి పట్టుపట్టడడంతో వెంకటేష్ తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో మోసపోయానని గుర్తించిన ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. తొలుత రేగిడి ఆమదాలవలస పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌కు పంపించారు. దీంతో వెంకటేష్‌పై అట్రాసిటీతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా డిమాండ్ విధించినట్టు తెలిపారు.

సోషల్ మీడియాతో మహిళ ఆచూకీ లభ్యం



హేమలతను అప్పగించిన దృశ్యం

వజ్రపుకొత్తూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బాతుపురం పంచాయతీ పెదవంక గ్రామానికి చెందిన దున్న హేమలత (50) ఆచూకీ సోషల్ మీడియా ద్వారా లభ్యమైంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. హేమలత ఆదివారం సాయంత్రం తోటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామస్థుల సాయంతో వెదికారు. అయితే ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆ గ్రామ యువకులు వాట్సాప్, ఫేస్‌బుక్‌లో ఆమె ఆచూకీ కోసం వివరాలు పొందుపరిచారు. ఇవి సోషల్ మీడియాలో జోరుగా సాగడంతో సోంపేట మండలం బూరగాం ఫ్లైఓవర్ వద్ద ఆమె ఉన్నట్లు ఆ గ్రామానికి చెందిన హరిప్రసాద్ గుర్తించి ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు సోమవారం మధ్యాహ్నం బూరగాం చేరుకుని హేమలతను ఇంటికి తీసు కువచ్చారు. ఈమె గతంలోనూ ఒకసారి కనిపించకుండా పోయింది. హేమలత అనారోగ్య సమస్యలతో మతిమరుపుగా ఉందని స్థానికులు తెలిపారు. ఎట్టకేలకు సోషల్ మీడియాలో ఆమె ఆచూకీ లభ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తంచేశారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 362 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవిద్యావాహిని డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 829 మంది అభ్యర్థులు హాజరు కాగా 362 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పైల తిరుమలరావు, ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు తెలిపారు. తెలిపారు. వారికి ఆఫర్ లెటర్లను అందించారు. ఎంపికలను పలు కంపెనీల ప్రతినిధులు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.సంధ్యారాణి, మన్మథరావు, ఏవో ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

ఒడియా మాధ్యమంలో బోధన చేపట్టాలి

పాతపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): చంగుడి గ్రామంలో కొత్తగా మంజూరైన ఉన్నత పాఠశాలలో ఒడియా మాధ్యమంలో బోధన చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరారు. రెండు రోజులుగా పాఠశాల నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సోమవారం వారితో ఎంఈవో కె.తిరుమలరావు సమావేశం నిర్వహించారు ఒడియా మాధ్య మం ఉండే ఉపాధ్యాయుల్ని నియమించాలని కోరారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందిం చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కె.కాంతారావు, ఎస్ఎంసీ చైర్మన్ బి.నర్సింహమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశ్రమలు తెరిచి ఉపాధి కల్పించాలి

● జీడి కార్మికుల డిమాండ్

పలాస, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జీడి పరిశ్రమలను తక్షణం తెరిచి ఉపాధి కల్పించాలని జీడి రైతు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీడి, రైస్ మిల్లు కార్మిక సంఘం ఆధ్వర్యంలో జీడి పప్పు ఉత్పత్తిదారుల సంఘం (పీసీఎంఏ) కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పారిశ్రామిక వాడలో బంద్ పాటించి గ్రామాల్లో పరిశ్రమలు నిర్వహించడంపై ఆందోళన వ్యక్తంచేశారు. పరిశ్ర మలు నష్టాల్లో ఉన్నాయని, జీడిపప్పు ఎగుమతులు లేవని, మార్కెట్‌లో తగినంత కొనుగోలు లేకపోవడం వంటి కారణాలతో జీడి వ్యాపార సంఘం 14 రోజుల బంద్ పాటించిన సంగతి తెలిసిందే. గడువు పూర్తి కావడంతో సోమవారం నుంచి పరిశ్రమలు తెరవాల్సి ఉంది. అయితే ఇంకా మార్కెట్‌లో ఒడిదు డుకుల వల్ల మరో ఆరు రోజులు పరిశ్రమలను మూసివేసేందుకు వ్యాపారులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న కార్మిక సంఘ నేతలు రెండు రోజుల కిందట సమావేశం నిర్వహించి పరిశ్ర మలు తెరవాలని వ్యాపార సంఘానికి లేఖలు అందించారు. దీనిపై వారి నుంచి ఎటువంటి స్పందన లేక పోవడంతో ధర్నాకు దిగారు.

గ్రామాల్లో పరిశ్రమలు ఎలా తెరిచారు?

ఈ సందర్భంగా కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఇక్కడ నష్టాలు వస్తున్నాయని పరిశ్రమలు బంద్ చేసిన వ్యాపారులు పొరుగు గ్రామాల్లో ఏ విధంగా పరిశ్రమలు నిర్వహించి కార్మికులకు పనులిస్తున్నారని ప్రశ్నించారు. కేవలం కార్మికులను రోడ్డున పడేసేందుకే బంద్ చేస్తున్నారని ఆరోపించారు. వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా కార్మికుల పొట్ట కొడుతున్నారని, ఎన్నడూ లేని విధంగా కార్మికసంఘ నాయకులు ఇస్తున్న లేఖలకు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పరిశ్రమలు వెంటనే తెరిపించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు కాశీ బుగ్గ పోలీసులు, రెవెన్యూ అధికారులకు లేఖలు అందించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సానా ఈశ్వరరావు, బొంపల్లి సింహాచలం, కోనారి రాము, కార్మికులు పాల్గొన్నారు.



పీసీఎంఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

ఘనంగా పాతపట్నం అమ్మవారి సంబరాలు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

నరసన్నపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామంలో పాతపట్నం అమ్మతల్లి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలంతా ముర్రాటలతో అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు చెల్లించారు. ఘటాల ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో విషధారణలు, డప్పులు వాయిద్యం ఆకట్టుకుంది. మధ్యాహ్నం వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి

నరసన్నపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ సూచించారు. సోమవారం వివిధ శాఖ అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి వినతులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో శోభారాణి, ఏవో సూర్యకుమారి, ఉద్యానవనశాఖ అధికారి సునీత, అమల, గృహ నిర్మాణశాఖ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చేయూతనివ్వండి



విశాఖపట్నంలో మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం విశాఖపట్నం వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఆయనతో పాటు టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన తదితరులు ఉన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

జలుమూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి హెచ్చు సంఖ్యలో ప్రజలను తరలించి విజయవంతం చేయాలని యోగా మండల నోడల్ అధికారి అరుంధతి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. విశాఖ వెళ్లేందుకు 20న సాయంత్రం జలుమూరులో బస్సులు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

దురదృష్టకర ఘటన

హిరమండలం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) ఆధ్యాత్మిక గ్రామంలో కూర్మలో అగ్ని ప్రమాదం దురదృష్టకరమని శ్రీకాకుళం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ (సుడా) కొరికాన రవికుమార్ అన్నారు. కిట్టాలపాడు పంచాయతీ కూర్మ గ్రామంలో అగ్నిప్రమాదంలో ఆహుతైన ఇస్కాన్ మందిరాన్ని సోమవారం పరిశీలించారు. ఈ మేరకు ఆశ్రమ నిర్వాహకులు హరోత్తమ దాస్ వద్ద నుంచి వివరాలు తెలుసుకున్నారు.

శివాలయానికి వెండి నాగాభరణం అందజేత

వజ్రపుకొత్తూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): శివసాగర్ బీచ్‌లో వెలసిన నీలకంఠేశ్వర ఆలయానికి గుణుపల్లి గ్రామానికి చెందిన జోగి ధనలక్ష్మి కుటుంబ సభ్యులు రెండున్నర కిలోల వెండి నాగాభరణం అందించారు. ఈ సందర్భంగా దాతల పేరున అర్చకులు పువ్వల జోగారావు, ఉమాపతి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

పోలాకి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోలాకి విశ్వేశ్వరనగర్‌లోని లక్ష్మీగణపతి ఆలయ పంచమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు సురవరపు సంతోష్, యాబాజి రాము దంపతులతో పాటు గ్రామస్థులతో వేద పండితులు ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు మావుడూరి లక్ష్మణ శాస్త్రి, జాడ కూర్మారావు శర్మ, పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో ఢిల్లీ హైకోర్టు జడ్జి



జలుమూరు: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుషార్ రావును ఆశీర్వదిస్తున్న అర్చకుడు

జలుమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామిని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుషార్ రావు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారి గోత్రనామాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేయించారు. ఆయనకు స్వామి వారి శేషవస్త్రాలు అందించి ఆశీర్వదించారు. అర్చకులు స్వామివారి పురాణం, ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాతపట్నం సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

నీలమణి దుర్గమ్మను..

పాతపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉత్కళాంధ్ర ఆరాధ్య దైవం నీలమణిదుర్గ ఆలయాన్ని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుషార్‌రావు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి, దేవాలయ సిబ్బంది కోడి సుధా కర్, అర్చకుడు తోనంగి సంతోష్, ఎస్ఐ బి. లావణ్య తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితుల ఆందోళన



డీటీ రాముకు వినతి పత్రం అందజేస్తున్న ఆఫ్‌షోర్ నిర్వాసితులు

మెళియాపుట్టి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని ఆఫ్ షోర్ నిర్వాసి తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూత్ ప్యాకేజీ పెంచాలని, గతంలో ఉపాధి కోల్పోయిన వారికి, సర్వేలో లేని వారికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. 2013 భూసే కరణ చట్టం ప్రకారం బావులు, గ్రామకంఠం భూములకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలన్నారు. 2013 జూలై 31 నాటికి 18 ఏళ్లు దాటలేదని యూత్ ప్యాకేజీ ఇవ్వలేదని, దీంతో అనేక మంది యువత నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం డీటీ రాముకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన కిట్లు

పలాస, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యాకిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, పాఠశాలల ప్రారంభంలోనే పాఠ్య పుస్తకాలు, బ్యాగులు తదితర సామగ్రిని అందించడం ప్రభు త్వం, సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమని ఏపీటీ పీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. స్థాని క ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యకు ప్రాధాన్యత ఇచ్చిందనేదానికి ఇదే నిదర్శనమన్నారు. ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, టీడీపీ నాయకులు గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, జోగ మల్లి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఏపీటీపీసీ చైర్మన్ బాబూరావు, మునిసిపల్ చైర్మన్ గిరిబాబు

అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలి

పలాస/పాతపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని ఆ సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలాస, పాతపట్నం తహసీ ల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ.. పే స్కేలు అమలు చేయాలని, ఏళ్ల తరబడి నామినీలుగా పని చేస్తున్న వారికి వీఆర్ఏలుగా నియమించాలని, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ కోటాను 70 శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయాల అధికారులకు వినతిపత్రం అందించారు. వీఆర్ఏల సంఘ అధ్య క్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి బి.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు సింహాచలం, పడుకు వెంకటరమణ, ఆర్.సావిత్రి, దేవాది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పలాస: ధర్నా చేస్తున్న వీఆర్ఏలు



పాతపట్నం: అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

న్యూస్ బాక్స్

అధికారులు బాధ్యతల స్వీకరణ

నరసన్నపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలానికి బదిలీపై వచ్చిన పలువురు అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా డిప్యూటీ తహసీల్దార్ పొదిలాపు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే మండల వ్యవసాయాధికారిగా వై.సూర్యకుమారి, మండల ఉద్యానవన శాఖ అధికారిగా సునీత బాధ్యతలు స్వీకరించారు. వీరికి సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

ఏవోగా సింహాచలం

ఎల్.ఎన్.పేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా కె.సింహాచలం సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పి.లతాశ్రీ ఆమదాలవలసకు బదిలీ అయ్యారు. సింహాచలం భామిని నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరికీ ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలు అందేలా కృషి చేస్తానని, రైతులకు అందుబాటులో ఉంటానన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శంకరరావు

జలుమూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.శంకరరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన మధుబాబు పొందూరుకు బదిలీ అయ్యారు. జలుమూరులో రీసర్వే డీటీగా పనిచేసిన శంకరరావును రెగ్యులర్ డీటీగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యల పరిష్కరించండి

టెక్కలి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా 20 అర్జీలు రాగా వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 11 ఉన్నాయి.

హామీలు తుంగలోకి: కృష్ణదాస్

నరసన్నపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో 'ప్రజలకు వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం తగదన్నారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'బడిబయట విద్యార్థులు'

పలాస, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అమ్మ ఒడి ఎగ్గొట్టడం వల్ల రాష్ట్రంలో 14.5 లక్షల మంది విద్యార్థులు బడికి దూరమయ్యారని వైసీపీకి చెందిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం ప్రగతిభవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి ఎంతమంది అమ్మలుంటే అందరికీ ఇచ్చామన్నారు.ఎమ్మె ల్యే శిరీష భాష బాగోలేదని, లిక్కర్‌పై అదనంగా రూ.10 తీసుకుంటున్నారన్నది స్పష్టమన్నారు.

హమ్మయ్య ప్రమాదం తప్పింది

నందిగాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పెద్దబాణాపురం పంచాయతీలోని కూడళ్లలో వాలిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సోమవారం సరిచేశారు. సర్పంచ్ పైల ఇందిర ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు కె.సంతోష్‌కుమార్, రవి పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది సుమారు 25 స్తంభా లను యంత్రం ద్వారా సరిచేశారు.